క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ, సిబ్బంది

అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ రైల్వేస్టేషన్, ప్లాట్ ఫాం, రైళ్లలో ఆర్‌పీఎఫ్ సీఐ కె.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను పరిశీలించడంతో పాటు రైళ్లలో ప్రయాణికులు బ్యాగులు, సూట్‌కేస్ తదితర వాటిని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్(ఆర్‌పీఎఫ్) దేబాష్మితే బెనర్జీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తమ పరిధిలో రెండు ప్రత్యేక టీంలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నారు. రైళ్లలో టపాసులు తీసుకెళ్లొద్దని సూచించారు. గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



చార్టుల ద్వారా వివరిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలని ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు అన్నారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్‌ను ఏర్పాటు చేసి బోధన పద్ధతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పద్ధతుల ద్వారా విద్యాబోధన చేయాలని, వివిధ సామగ్రిని ఉపయోగిస్తూ బోధన చేయడం వల్ల విద్యార్థులకు త్వరితగతిన అర్థమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 5 నుంచి ధారూరు జాతర



ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ నెలలో జరగాల్సిన ధారూరు మెథడిస్టు జాతర ఉత్సవాలను జాతర కమిటీ సభ్యులు, జిల్లా అధికారులతో మాట్లాడి తేదీ మార్చడం జరిగిందని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతర ఉత్సవాలను డిసెంబర్ 5 నుంచి 10 వరకు నిర్వహిస్తారని ఆయన వివరించారు. కావున, మండలాలు, జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గ్రహించి పైన తెలిపిన తేదీల్లో జాతరకు రావాలని ఆయన సూచించారు.

పోలీస్ అబ్జర్వర్‌ను కలిసిన ఎస్పీ

ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు పోలీసు అబ్జర్వర్‌గా వికారాబాద్‌కు వచ్చిన డీఐజీ ఠాకూర్ తాపను ఎస్పీ కోటిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు



నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దేముల్: నాటుసారా తయారీ స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు.. మండలంలోని తట్టెపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గురువారం నాటుసారా తయారు చేస్తున్న పలు స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 150 లీటర్ల బెల్లం పాకం, 15 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, సారా తయారు చేసే వస్తువులను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న భవాన్ అశోక్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటుసారా అమ్మినా, కొన్నా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పూడూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన బర్ల బాలశంకర్ రాత్రి గ్రామం నుంచి అత్తగారి ఇంటికి పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్తుండగా మీర్జాపూర్ గేటు సమీపంలో అతివేగంగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొనడంతో బాలశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగని ఇసుక అక్రమ దందా

- ఉదయం, రాత్రి సమయాల్లో జోరుగా రవాణా
- రాజకీయ నాయకుల అండతోనే వ్యాపారం
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు



పెద్దేముల్ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

పెద్దేముల్: మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రెవెన్యూ , పోలీసు అధికారులు ఎన్నికల బిజీలో ఉండటంతో ఇదే అదునుగా ఇసుక అక్రమ వ్యాపారస్తులు ఉదయం, సాయంత్రం వేళ్లలో ఇష్టమొచ్చినట్లు తరలిస్తున్నారు. మరి కొంతమంది ఇసుక దళారులు అధికారుల సహకారం, రాజకీయ పలుకుబడితో మండల కేంద్రం మీదుగా రవాణా కొనసాగిస్తున్నారు. వాగుల్లో రోజంతా ఇసుకను కుప్పలు పోసి రాత్రి, ఉదయం సమయాల్లో ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తున్నారు. ముఖ్యంగా మండలంలో మన్‌సాన్‌పల్లి, రుక్మాపూర్, కొండాపూర్, యాలాల మండల బిజ్వారం వాగుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. పత్రికల్లో వార్తలు వచ్చిన సమయంలో నామమాత్రంగా పోలీస్ అధికారులు దాడులు చేశామని చెప్పటం తప్ప మిగతా సమయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. ఇసుక అక్రమ వ్యాపారంలో అధికారులకు ముడుపులు అందుతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా... నకిలీ విత్తనాలను అరికట్టాలని ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయినా ఫలితం లేదు. మండలంలో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు నాటు సారా స్థావరాలపై దాడులు చేయడం తప్ప ఇసుక అక్రమ రవాణాను ఎందుకు అరి కట్టడం లేదని పలు గ్రామాల ప్రజలు నిలదీస్తున్నారు. పోలీసు అధికారుల సహకారంతో ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు పలుమార్లు రవాణాను అరికట్టాలని ఆదేశాలు జారీ చేసిన ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. 12నెలల్లో 9నెలలు అక్రమ ఇసుక వ్యాపారం కొనసాగుతుందని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

దళారులకు అడ్డాగా మంబాపూర్

అక్రమ ఇసుక దళారులకు మంబాపూర్ అడ్డాగా మారింది. మన్‌సాన్‌పల్లి, బిజ్వారం, రెగోండి గ్రామాల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లు మంబాపూర్ మీదుగా ఇతర గ్రామాలకు వెళ్తాయి. ఉ. 5గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 6గంటల నుంచి తెల్లవారు జాము వరకు అక్రమ ఇసుక రవాణా కొనసాగిస్తారు. అంతేకాకుండా కాగ్నా పరివాహక ప్రాంతంగా ఉన్న మదనంతాపూర్, రెగోండి, రుక్మాపూర్, ఖాంజాపూర్, కందనెల్లి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వాగుల సమీపంలోని పొలాల్లో కూలీలకు వ్యాపారులు స్థావరాలు ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్నారు.

అనుమతులు ఇవ్వడం లేదు



ప్రభుత్వం ఇసుక అనుమతులు రద్దు చేసింది. మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే ఆయా గ్రామాల్లో సిబ్బందిని కాపాలాగా పెట్టి అక్రమ ఇసుకను తరలించకుండా చూస్తాం. ట్రాక్టర్‌లు దొరికితే సీజ్ చేస్తాం.

–కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

వీఆర్వోను దూషించిన వ్యక్తికి జైలు

మర్పల్లి: మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోను ఓ వ్యక్తి అసభ్య పదజాలంతో దూశించిన ఘటనలో గురువారం ఎల్‌బీనగర్ కోర్టు మేజిస్ట్రేట్ ఆరు నెలల జైలు శిక్ష రూ. 5,000 జరిమానా విధించినట్లు మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. 2016లో మర్పలిలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న వడ్ల మోహన్‌ను మండలంలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన వడ్ల కాశీనాథ్ వీఆర్వో మోహన్ విధులకు ఆటంకం కల్పించి అసభ్య పదజాలంతో పాటు కులం పేరుతో దూశించిన నేరానికి ఎల్‌బీనగర్ కోర్టు మేజిస్ట్రేట్ కోర్టు శిక్ష విధించినట్లు వివరించారు. కేసు విచారణ అధికారిగా ఉన్న వికారాబాద్ డీఎస్పీ స్వామి, కోర్టు కానిస్టేబుల్స్‌గా ఉన్న గోపాల్, రమేష్‌లతో పాటు, కోర్టు లైజనింగ్ అధికారి శ్రీనివాస్‌లను వికారాబాద్ ఎస్పీ అభినందించినట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

మహాసభను విజయవంతం చేద్దాం

బొంరాస్‌పేట: ఈనెల11న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌడ్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మందకృష్ణ మాదిగ చేపట్టిన విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌మాదిగ పిలుపునిచ్చారు. మహాసభకు మాదిగలు, ఉపకులాలు భారీగా తరలిరావాలన్నారు.

బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలి



బంట్వారం: మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్



తాండూరు: సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని వికారాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం బంట్వారం మండలంలోని తొర్మామిడి, బొప్పునారం, యాచారం, మాలసోమారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్‌కు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. వారు గ్రామాల్లోకి వస్తే తరిమి కొట్టాలని ప్రజలకు విన్నవించారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో కల్వకుంట్ల కుటుంబం ఎక్కడికక్కడ దోచుకుని తెలంగాణను అధోగతి చేసిందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మారిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను మళ్లీ తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోషా, నాయకులు కొండల్‌రెడ్డి, రంగారెడ్డి, వాహిద్, రత్నారెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సింలు, హరీశ్వర్‌రెడ్డి, రాజు, పురుషోత్తం రెడ్డి, అరవింద్‌రెడ్డి, డి.నర్సింహులు, ఎస్. నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

గురువర్యులు ఆశీర్వదించండి

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల్లో విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఆ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అభ్యర్థించారు. గురువారం పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల ఫోరం భవనంలో విశ్రాంత ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గురువు సమానులైన విశ్రాంత ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. ప్రతి నెల ఆసరా పెన్షన్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరోగ్య కార్డుల ద్వారా సత్వర వైద్య సేవలు అందించలేక పోయారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి నెల ఒకటవ తేదిన పెన్షన్ డబ్బులు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మున్సిపల్ కౌన్సిలర్ సోమశేఖర్, నాయకులు ఉత్తంచంద్, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.



యాలాల: కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

యాలాల: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ సంపత్‌కుమార్, కోలుకుంది హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని దేవనూరు, గోరేపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్, హన్మంతు మాట్లాడుతూ.. తాండూరులో బుయ్యని మనోహర్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత 25 ఏళ్లుగా బీజేపీలో కొనసాగిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, పంచాయతీ వార్డు సభ్యులు సుమారు 100 మందికి పైగా అనుచరులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లోకి చేరడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో దేవనూరు మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, గోరెప్ప, శ్రీనివాస్, ఎల్లప్ప, వార్డు సభ్యులు వడ్ల చంద్రయ్య, బోడ్క శ్రీనివాస్, కమ్మరి వీరన్న, జోగు నర్సింహులు రామయ్య, కోస్గి నర్సింహులు, కుర్వ ఆశప్ప, మంత్రి శ్రీనివాస్, బాలప్ప, ఈడ్గి మొగులయ్య, వడ్డే పెద్ద రాములు, గోరేపల్లికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రమేష్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఉద్యమకారుడు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఎం.నాగరాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎ.శివమణిగౌడ్‌లు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు పటోళ్ల బసప్ప, నాయకులు బస్వరాజ్, డి.రాజేందర్, ప్రకాశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

మర్పల్లి: మండలంలోని రావులపల్లిలో కాంగ్రెస్ పార్టీకి అనూహ్య స్పందన వచ్చిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు నల్ల అబ్రహాం అన్నారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ పేద ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకే ఓటు వేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి గ్యారంటీ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు వినోద్, శివకుమార్ కార్యకర్తలు ఉన్నారు.

కదం తొక్కిన కాషాయ దళం



ర్యాలీగా నామినేషన్‌కు వెళ్తున్న మారుతికిరణ్

పరిగి: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మారుతికిరణ్ భూనేటి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ బీసీ సీఎంను ప్రకటించి బీసీలకు న్యాయం చేస్తుందన్నారు. బీజేపీ బీసీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. కేసీఆర్ చేసిన అ వినీతి పాలన ప్రజలను నిట్టనిలువున మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేకను ఎత్తుకెళ్లిన చిరుత

అనంతగిరి: మందలో నుంచి ఓ మేకను చిరుతపులి లాక్కెళ్లిన ఘటన గురువారం సాయంత్రం వికారాబాద్ మండలంలోని గోధుమగూడ గ్రా మ అడవిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శంకరయ్యగౌడ్ రో జు మేకలను అడవిలో మేపుకొని వస్తుంటాడు. గు రువారం సాయంత్రం మేకలను ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో వెనుక నుంచి ఒక్కసారిగా చిరుత దాడి చేసి ఓ మేకను ఎత్తుకెళ్లింది. ఈ ఘటన అటు గా వెళ్తున్న వాహనదారులు చూసి భయపడి చిరుతపులి అని అరుస్తుండగా శంకరయ్య వెనక్కి చూడగానే మేకను చిరుత ఎత్తుకెళ్లిందని వారు తెలిపారు. శంకరయ్య ఇంటికి వచ్చి చూడగా మేక మందలో లే దు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

కేటీఆర్ సభకు తరలిన నేతలు



బొంరాస్‌పేట: చౌదర్‌పల్లిలో సర్పంచు, నాయకులు

బొంరాస్‌పేట: పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా కొడంగల్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్ సభకు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల నుంచి గురువారం పెద్ద ఎత్తున పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు. బైక్ ర్యాలీలు, ఊరేగింపులతో వెళ్లారు. మహిళా సర్పంచులు చౌదర్‌పల్లి వెంకటమ్మ, మేడిచెట్టుతండా జ్యోతి, రేగడి మైలారం రాజేశ్వరి కలిసి డీజేపాటలకు డ్యాన్సులు చేసి అలరించారు.



రేగడిమైలారంలో బైక్‌ర్యాలీ, ఊరేగింపు



డ్యాన్సులు చేస్తున్న మహిళా సర్పంచులు

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి శివలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి శివలీల

తాండూరు టౌన్ : పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తాండూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివలీల అన్నారు. గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక పీపుల్స్ డిగ్రీ కళాశాలలో మండల లీగల్ సరీ్వసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే దశలో నేరాలకు పాల్పడితే జీవితం నాశనమవుతుందన్నారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చట్టాలపై అవగాహన కల్గి, ఉత్తమ పౌరులుగా మెలగాలన్నారు. డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చిన్న చిన్న నేరాలు సైతం ప్రభుత్వ ఉద్యోగాలు రాకుండా చేస్తాయన్నారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ.. చట్టం ఎవరికీ చుట్టం కాదని, నేరం చిన్నది అయినా, పెద్ద అయినా శిక్ష మాత్రం తప్పదన్నారు. ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, మొబైల్‌లో అసభ్య మెసేజ్‌లు పంపడం నేరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మఠం చంద్రశేఖర్, పాశం రవికుమార్, కళాశాల కార్యదర్శి ఉత్తంచంద్, ప్రిన్సిపాల్ సత్యానంద్, న్యాయవాదులు శ్రీనివాస్, గుండప్ప, రవీందర్, వాణిశ్రీ, రజిత, అనీల, విశ్వనాథ్, కమలాకర్, బందెప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత అభివృద్ధి



పరిగి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అశోక్‌కుమార్

- మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్

పరిగి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి మన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేశారని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. గత ఉమ్మడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో, ప్రస్తుతం ఏవిధంగా ఉందో ప్రజలు గ్రహించారని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

దోమ : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులలై ఆయా పార్టీల నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోత్కుర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రావు, బీజేపీ, కాంగ్రెస్ నేతలు వైస్ ఎంపీపీ మల్లేశం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిలో సీఎం కేసీఆర్ కృషి ఎనలేనిదన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, గ్రామ బీఆర్‌ఎస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



దోమ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జిల్లాలో 20 నామినేషన్లు దాఖలు

అనంతగిరి: వికారాబాద్‌లో 6 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం12 మంది అభ్యర్థులు 17సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం వసంత్‌కుమార్ ఆమ్‌ఆద్మీ పార్టీ, పెద్దింటి నవీన్‌కుమార్ బీజేపీ, మేథరి నర్సింలు ఇండియా ప్రజాపార్టీ, బి.ఆనంద్‌కుమార్ అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రెఫామ్స్ పార్టీ నుంచి దాఖలు చేశారు. ఇదిలా ఉండగా బీఎస్పీ నుంచి క్రాంతికుమార్ మరోసెట్ దాఖలు చేయగా, డీఎస్పీ నుంచి జి.రవీందర్ కూడా మరోసెట్ దాఖలు చేశారు.

పరిగిలో 14 నామినేషన్లు దాఖలు

పరిగి: పరిగి ఆర్‌ఓ కార్యాలయంలో గురువారం 14 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ విజయకుమారి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి టి రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మారుతికిరణ్‌తో పాటు తెలంగాణ రిపబ్లిక్‌పార్టీ, బీసీవై పార్టీ, బీఎస్పీ, బీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖాలు చేశారు. 10 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పరిశీలకుడిగా ఆసిఫ్‌ఖాన్



ఆసిఫ్‌ను అభినందిస్తున్న నాయకులు

కొడంగల్ : నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పరిశీలకుడిగా పట్టణానికి చెందిన ఆసిఫ్‌ఖాన్‌ను నియమించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ బాధ్యతలు అప్పగించినందుకు రేవంత్‌రెడ్డికి, ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి, తెలంగాణ మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి ఫరాన్ అజ్మీలకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పట్టణంలోని రేవంత్ నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్‌ఖాన్‌ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రేవంత్‌రెడ్డి గెలుపు కోసం పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు యూసూఫ్, నందారం ప్రశాంత్, సోమశేఖర్, నయీమ్, ఎస్ఎం గౌసన్, రాము పాల్గొన్నారు.